క్లుప్తంగా

తుంగభద్ర నదికి తగ్గిన వరద

నందవరం: తుంగభద్ర నదికి వరద ప్రభావం స్వల్పంగా తగ్గింది. శనివారం మండల పరిధిలోని నాగలదిన్నె వంతెన వద్ద తుంగభద్ర నది వరద ప్రభావం తగ్గింది. దీంతో రైతు నది ఒడ్డున విద్యుత్ మోటార్లు బిగించుకుని పరి మళ్లకు నీరు కట్టుకుంటున్నారు. వరద ఉధృతి తగ్గడంతో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు.

చట్టాల గురించి తెలుసుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి యజ్ఞ నారాయణ

ఆదోని రూరల్: ప్రతిఒక్కరూ చట్టాల గురించి తెలుసుకోవాలని ఆదోని సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ అన్నారు. న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం మండలంలోని విరుపాపురం గ్రామంలో నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ సివిల్ తగాదాలను కోర్టు వరకు రాకుండానే లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. ఆస్తి తగాదాలు, క్రిమినల్ కేసులను సత్వరమే పరిష్కరించుకోవచ్చని చెప్పారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసులకు అప్పీలు లేదని, అజాగ్రత్త గురించి తెలియజేశారు. బాల్య వివాహం వల్ల కలిగే నష్టాలపై తెలియజేశారు. కార్యక్రమంలో రూరల్ పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు యూరియా అందేలా చూస్తాం

పెద్దకడుబూరు : మండలంలోని ప్రతి రైతుకు యూరియా అందేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గీతా ప్రియదర్శిని, వ్యవసాయ అధికారి సురేష్ అన్నారు. మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామ రైతుసేవా కేంద్రాన్ని శనివారం వారు ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను, స్టాక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ జెస్సియా, రైతు సేవా కేంద్రం సిబ్బంది తదితరులు ఉన్నారు.

శ్రీమఠంలో ఎన్టీఆర్ యూనివర్సిటీ ఉపకులపతి

మంత్రాలయం: రాఘవేంద్రస్వామి దర్శనార్థం ఎన్టీఆర్ హెల్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఉపకులపతి చంద్రశేఖర్ శనివారం మంత్రాలయం విచ్చేశారు. ముందుగా ఆయన గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూలబృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు.

రేషన్ షాపు తనిఖీ

గోనెగండ్ల : రేషన్‌ను డీలర్లు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ రాజేశ్వరి సూచించారు. శనివారం మండలంలోని వేముగోడు గ్రామంలో 17వ రేషన్ షాపును తహసీల్దార్ తనిఖీ చేశారు.65 సంవత్సరాలు పైబడిన వారికి, దివ్యాంగులకు పంపిణీ చేసే రేషన్ డోర్ డెలివరీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

లక్ష్మారెడ్డికి నివాళ

ఎమ్మిగనూరుటౌన్: డీటీఎఫ్ ఉమ్మడి రాష్ట్రాల వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని సంఘ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొక్కన్న, ఉపాధ్యాయ క్రాంతి సంపాదకులు రత్నం ఏసప్ప, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజి.వెంకట్రాముడు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్ ఎస్.లక్ష్మన్న మృతి



ఎస్.లక్ష్మన్న (ఫైల్)

ఆదోని అర్బన్: కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్ ఎస్.లక్ష్మన్న శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. మంత్రాలయం మండల ఆయన డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ ఆఫీసులో విధులు నిర్వహిస్తుండగా గుండెపోటుకు గురై మృతిచెందారు. దీంతో మున్సిపల్ సిబ్బంది కర్నూలు విశ్వభారతి ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం ఉదయం స్టేట్ వేరాలు, ఆ తరువాత ఆయనకు ఫిట్స్ వచ్చి కోమాలోకి వెళ్లారని, శనివారం తెల్లవారుజామున మరణించారని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వ వైద్యరంగంలో దాదాపు 20 ఏళ్లుగా సేవలందించారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకుందాం

కౌతాళం: మండలంలో వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకుందామని సీఐ అశోక్ కుమార్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, వివిధ మతాల పెద్దలతో కలిసి పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ వినాయక మండపాల ఏర్పాటుకు తప్పక పంచాయతీ, విద్యుత్, పోలీసు అధికారులతో అనుమతి తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద డీజేలకు అనుమతి తప్పని సరి అన్నారు. వీహెచ్‌పీ సభ్యులు మారుతి మోహన్, వెంకటపతిరావు, డాక్టర్ సుబ్బారాజు, రాఖనంద, మంజు, రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

నందవరం: ఇబ్రహీంపురం, మాచాపురం, నదికైరవాడి, గంగవరం, జోహారాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, నాగలదిన్నె గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో గణేష్ ఉత్సవాలపై ఎస్ఐ కేశవ సమావేశం నిర్వహించారు.

- పొలాల్లోనే నిలిచిన వర్షపునీరు
- కల్వర్టును తొలగించడంతో నీరు బయటకు వెళ్లలేని పరిస్థితి
- రైతులు అధికారులకు విన్నవించినా పట్టించుకోని వైనం
- పంటలు కుళ్లి నష్టపోతున్న అన్నదాతలు

చేను చెరువాయే!



చెరువును తలపిస్తున్న పొలం

ఆదోని సెంట్రల్: మండలంలోని మండగిరి గ్రామ పంచాయతీ పరిధిలోని పొలాలు చెరువును తలపిస్తున్నాయి. పట్టణం నుంచి జగనన్న కాలనీకి వెళ్లే రహదారి, బైపాస్ రోడ్డులోని పొలాల్లో గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు నీరు పొలాల్లోనే నిలిచిపోయాయి. దీనికి తోడు కొందరు స్వార్థం కోసం వాగుపై ఉన్న కల్వర్టులను పూడ్చి వేయడంతో బయటకు వెళ్లడానికి అవకాశం లేక పోవడంతో సాగుచేసిన పంటలు నీట మునిగాయి. వాన తెరిపిచ్చినా కూడా పొలాల్లో నీరు తగ్గడంలేదు. పొలాల్లో నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

60 ఎకరాలు నీటి పాటు..

ఎకరా కాదు, రెండు ఎకరాలు దాదాపు 60 ఎకరాలు దాకా పంటలు నీట మునిగాయి. పెట్టుబడి రూ.వేలల్లో పెట్టింది ఎన్నో ఆశలతో విత్తనం వేసుకుంటే నీరు నిల్వ ఏర్పడి పైరు మొత్తం కుళ్లిపోయే పరిస్థితి నెలకొంది కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సమీపంలో జగనన్న కాలనీలోకి వెళ్లే రహదారిలో వాగుపై వేసిన కల్వర్టులను వారి పొలాల్లోకి నీటిని రాకుండా చేసే స్వార్థంతో పైపులను కొందరు తీసివేసి ఎత్తుగా మట్టి కట్టలు వేశారు. దీంతో నీరు ముందుకు వెళ్లేందుకు వీలులేక పొలాల్లోనే నిలుస్తోంది. నీరు నిల్వ లేకుండా సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా మా సమస్యను ఎవరు పట్టించుకోవడం లేదని బాధిత రైతులు వాపోతున్నారు. పంటలు వేసిన ప్రతిసారి ఇలా అపారమైన నష్టం జరిగితే మాకు మిగిలేది అప్పులే అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులందరు కలసి ప్రస్తుత ఎమ్మెల్యే డా. పార్థసారధిని కలసి సమస్య వివరించామని, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, అయితే అధికారులు వచ్చి చూసి వెళ్లిపోయారే తప్ప ఇంత వరకు ఏలాంటి చర్యలు చేపట్ట లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మా రైతులు సమస్యను దృష్టిలో ఉంచుకొని పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

సమస్యను పరిష్కరించండి



పంటపొలాల్లో నీరు నిల్వ ఏర్పడి అపారమైన నష్టం కలిగింది. వర్షపు నీరు వెళ్లడానికి దారి లేదు. దీంతో ఎక్కడి నీరు అక్కడే ఆగిపోతున్నాయి. ఎన్నో ఆశలతో వేసిన పంటలు నీట మునిగి పైరు ఎదగడం లేదు. దీంతో పెట్టిన పెట్టుబడి అంతా నీళ్లపాలైంది. పంట చేతికి వచ్చేదెప్పుడు, మేము బాగుపడేదెప్పుడు. జగనన్న కాలనీకి వెళ్లే రహదారికి కల్వర్టులను ఏర్పాటు చేసి నీరు నిల్వ ఏర్పడకుండా సాఫీగా వెళ్లేందుకు తగు చర్యలు చేపట్టాలి. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కరించాలి. – ముల్లా నజీర్ రైతు



నీట మునిగిన పంటలు



నీటి మడుగులోనే వెళ్తున్న ప్రజలు

ఎరువుల దుకాణాల తనిఖీ

ఆదోని రూరల్: పట్టణంలోని శ్రీ లక్ష్మీ గణేష్ ఎంటర్ ప్రైజెస్, ఆదిత్య ట్రేడర్స్ ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో యూరియా విక్రయాలపై తహసీల్దార్ రమేష్ తనిఖీలు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతులకు యూరియాను ఎటువంటి లింకులు లేకుండా ఇవ్వాలన్నారు. ప్రతిరైతుకు భూ విస్తీర్ణం ఆధారంగా గరిష్టంగా మూడు బస్తాల వరకు మాత్రమే ఇవ్వాలన్నారు. రైతులు యూరియా పొందడానికి తప్పనిసరిగా పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు తీసుకురావాలని సూచించారు. డీలర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయాలు జరుపరాదని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఏఓ సుదాకర్, ఏఈఓ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

కేబుల్ వైర్ల తొలగింపు

ఎమ్మిగనూరుటౌన్: విద్యుత్ ప్రమాదాలు నివారించేందుకు పట్టణంలో విద్యుత్ స్తంభాలకు అనుమతి లేకుండా వేసిన డిష్‌కేబుల్ వైర్లను శనివారం విద్యుత్ శాఖ సిబ్బంది తొలగించారు. పట్టణంలోని వైఎస్‌ఆర్ సర్కిల్ నుంచి పార్క్ రోడ్ వరకు విద్యుత్ స్తంభాలకు గుట్టలు గుట్టలుగా ఉన్న కేబుల్ వైర్లను తీసేశారు. అయితే ముందస్తుగా తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కేబుల్ వైర్లను తొలగించడం భావ్యం కాదని పలువురు కేబుల్ ఆపరేటర్లు విద్యుత్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. విద్యుత్ శాఖ అనుమతి తీసుకొని కేబుల్ వైర్లను స్తంభాలపై సురక్షితంగా వుండేలా వేసుకోవచ్చని ఏఈ ప్రసన్న ఆంజనేయులు తెలిపారు.

ఈరన్నస్వామి సన్నిధిలో భక్తుల సందడి



ఆలయ ముఖద్వారం వద్ద భక్తుల సందడి





దాతకు తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం, పరస్పరం కొట్టుకుంటున్న బ్యాంకు, ఆలయ ఉద్యోగులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయానికి భక్తులు పోటెత్తారు. శనివారం అమావాస్య కావడంతో పాటు శ్రావణమాస చివరి రోజు కావడంతో భక్తులు తమ ఇంటి ఇలవేల్పును దర్శించుకోవడానికి వేలాదిగా తరలివచ్చారు. శుక్రవారం సాయంత్రం నుండే స్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహాంగళహారతి, అభిషేకం, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. అమావాస్య సందర్భంగా లక్ష పుష్పార్చన పూజలు చేపట్టడంతో భక్తులు పూజల్లో పాల్గొని భక్తిని చాటుకున్నారు. భక్తులను విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనం, శ్రీఘ్ర దర్శనం, ఉచిత, వీఐపీ దర్శనాల ద్వారా దర్శనానికి పంపారు. భక్తుల రద్దీతో ఆలయ పరిసరాలు ఎటు చూసిన భక్త జనసంద్రంగా కనిపించాయి. పిండి వంటలు వండి స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఉరుకుందకు ఐదు కిలోమీటర్ల దూరంలో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి ఆలయం, తుంగభద్ర నది ఒడ్డున మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయానికి అమావాస్య వేడుకలతో భక్తులు అధికంగా తరలివచ్చారు.

అన్నదానానికి రూ.50వేలు విరాళం

ఈరన్న స్వామి దేవాలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదానానికి సుంకేసుల గ్రామ వాస్తవ్యులైన కురవ చిన్నరంగన్న వారి కుటుంబ సభ్యులు రూ.50,005 నగదు రూపంలో అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డులు, బాండను, ఫోటోను అందజేశారు.

ఆలయ సిబ్బంది అత్యుత్సాహం

మంత్రాలయం : ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ కౌంటర్ సార్టింగ్ ఉద్యోగులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆదోని ఇండియన్ బ్యాంకుకు చెందిన కౌంటర్ సిస్టం ఆపరేటర్లు ఉరుకుంద ఈరన్న స్వామి టిక్కెట్ల కౌంటర్లలో విధులు నిర్వర్తిస్తున్నారు. సదరు సిబ్బంది స్వామి దర్శనార్థం ఉత్తర ద్వారం వద్దకు వెళ్లారు. దర్శన అవకాశం కల్పించాలని అక్కడ కోరగా.. విధుల్లో ఉన్న ఆలయ కౌంటర్ సార్టింగ్ ఉద్యోగులు నరసింహులు, ఉసేని నిరాకరించారు. ఇరువురి మధ్య మాటామాటా పెరిగి బ్యాంకు సిబ్బందికి అనుమతి ఇవ్వకపోవడంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చివరకు పరస్పరం దాడికి దిగడంతో ఉత్తర ద్వారంలో కాసేపు ఉద్రిక్తత ఏర్పడింది. ఇరువురిని అదుపు చేసేందుకు యత్నించిన ఆలయ సూపరింటెండెంట్ మల్లికార్జున, జూనియర్ అసిస్టెంట్ వీరేష్ బొక్కాలు చిరిగిపోయాయి. ఆలయ ఉద్యోగులు ఇలా చేయడంపై కొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయానికి మచ్చ తెచ్చేలా ప్రవర్తించిన కౌంటర్ సార్టింగ్ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని భక్తులు అభిప్రాయ పడుతున్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



ప్రత్యేక అలంకరణలో బసవేశ్వర స్వామి



రామలింగేశ్వర స్వామికి అభిషేకాలు గావిస్తున్న భక్తులు



భద్రకాళిసమేత వీరభద్రస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

నందవరం : దక్షిణ కాశీగా పేరుగాంచిన గురజాల రామలింగేశ్వర స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు గావించారు. శనివారం అమావాస్య కావడంతో భక్తులతో గురజాల శైవ క్షేత్రంతో పాటు నందవరంలోని బంగారమ్మవ్వ దేవాలయం, వీరప్ప స్వామి ఆలయాలు భక్తుల భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు గావించారు. గురజాల గ్రామంలో పవిత్ర శైవక్షేత్రంలో తెల్లవారుజాము నుంచే భక్తులు నది స్నానాలు ఆచరించి రామలింగేశ్వర స్వామి, పార్వతీదేవికి పుష్పహారాలు హంపేష్ ఆధ్వర్యంలో జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆదిదంపతులకు మహామంగళహారతి చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. గురజాల క్షేత్రంతో పాటు నందవరంలోని బంగారమ్మవ్వ దేవాలయం, వీరప్ప స్వామి దేవాలయాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అమావాస్య పర్వదినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

బసవేశ్వర స్వామికి విశేష పూజలు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని బసవన్న కొండపై వెలసిన శ్రీ బసవేశ్వర స్వామికి విశేష పూజలు చేపట్టారు. శనివారం అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఉమేష్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి వేకువ జామున నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండికవచ అలంకరణ, ఆకు పూజ గావించి మహా మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు.

శివాలయంలో అమావాస్య పూజలు

ఆదోని అర్బన్: అమావాస్య సందర్భంగా శనివారం పట్టణంలోని శైవాలయాల్లో పూజలు జరిగాయి. కోటగడ్డలో వెలిసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్రేశ్వరస్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పంచామృతాభిషేకం, పూలు, వెండి అలంకరణ, మహామంగళహారతి చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివిదంగా ఎమ్మిగనూరు రోడ్డులో వెలిసిన గంగాభవాని ఆలయంలో శివుడికి ప్రత్యేక పూజలు జరిపించారు.

వైభవంగా గుంటిరంగస్వామి రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



స్వామివారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ శివారులోని వెంకటాపురం కాలనీలో శనివారం సాయంత్రం గుంటిరంగస్వామి మహారథోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో స్వయంభూగా వెలసిన గుంటి రంగస్వామికి పూజలు అనంతరం భక్తులు గోవింద నామస్మరణతో మహారథోత్సవాన్ని నిర్వహించారు. రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని దర్శించుకొని అనంతరం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, సీనియర్ నాయకులు బుట్టా శివనీలకంఠ, వెంకటాపురం మున్సిపల్ కౌన్సిలర్, పార్టీ పట్టణ బీసీ విభాగం ఉపాధ్యక్షుడు బోయ బజారి, యూత్ విభాగ అధ్యక్షుడు బోయ రాజు, జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, విరూపాక్షిరెడ్డి, పార్టీ నాయకులు స్వామి వారికి ప్రత్యేక పూజ చేశారు. వారికి ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు నీలకంఠరెడ్డి, భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగన్న, పాండురంగ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి

ఎమ్మిగనూరుటౌన్: భారీ వర్షాలతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం పంట నష్టపరిహారం మంజూరు చేసి ఆదుకోవాలని ఏపీ రైతు కూలీ సంఘ జిల్లా కార్యదర్శి ఏసేపు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఎఫ్‌టీయూ, రైతు కూలీ సంఘ నాయకులు జయన్న, హనీఫ్, కాంసన్, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమం పట్టని ప్రభుత్వం

ఎమ్మిగనూరుటౌన్: దళితుల సంక్షేమం పట్టని విధంగా కూటమి ప్రభుత్వంపై ఉద్యమించక తప్పదని కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దేవసహాయం, ఆనంద్‌బాబు, ఉపాధ్యక్షుడు కరుణాకర్ అన్నారు. శనివారం స్థానిక కేవీపీఎస్ కార్యాలయంలో ఆ సంఘ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. నాయకులు జయరాజు, తిక్కప్ప, చిన్నమారయ్య, తిమ్మన్న, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

26న వీరభద్రేశ్వరస్వామి ఉద్భోత్సవం

ఆదోని అర్బన్: భాద్రపద మాసం మొదటి మంగళవారం (26–8–2025)న వీరభద్రేశ్వరస్వామి ఉద్భోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు అల్మూరి మఠం మహర్షి విజయకుమార్ శనివారం తెలిపారు. దేవస్థానంలో ఉదయం 7 గంటల నుంచి రుద్రాభిషేకం, దేవస్థానంలో స్వామివారికి పల్లకీసేవ, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

కోసిగి: మండల పరిధిలోని చింతకుంట గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడిని మట నలో ఇద్దరికి గాయాలయ్యాయి. శనివారం అమావాస్య కావడంతో కోడుమూరుకు చెందిన గిద్దయ్య, భార్య వరలక్ష్మిలు ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనార్థం బైక్‌పై బయలుదేరారు. చింతకుంట వద్ద గుంతలను తప్పించ బోయి అదుపు తప్పి కింద పడ్డారు. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరికి కోసిగి ఆసుపత్రిలో చికిత్స అందించారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళి

ఆదోని రూరల్: స్థానిక ఏఐవైఎఫ్ కార్యాలయంలో శనివారం భారత కమ్యూనిస్టు పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, నల్గొండ మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి బసాపురం గోపాల్ మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డి మరణం పార్టీకి తీరనిలోటన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి కె.రమేష్, ఏఐటీయూసీ కార్యదర్శి ఏ.విజయ్, పరశురాముడు, మారెప్ప, కుమార్, రమేష్ పాల్గొన్నారు.

దర్గాకు పోటెత్తిన భక్తులు



దర్గాలో బారులు తీరిన భక్తులు

కౌతాళం: మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో శనివారం అమావాస్య వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతెహాలను నిర్వహించారు. పిండి వంటలు వండి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధికంగా తరలిరావడంతో దర్గా పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున నుంచి గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిస్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిస్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు.

రమణీయం.. మహారథోత్సవం



భక్తజనసందోహం మధ్య సాగుతున్న రథోత్సవం

ఆదోని అర్బన్: శ్రావణమాసం తుది శనివారాన్ని పురస్కరించుకుని పట్టణశివారులోని రణమండల కొండలో వెలిసిన రణమండల ఆంజనేయస్వామి మహారథోత్సవం పట్టణంలోని ప్రధాన రహదారిలో భక్తుల మధ్య అంగరంగ వైభవంగా సాగింది. ఆలయ నిర్వాహకుడు టీజీ పాండురంగయ్యశెట్టి ఆధ్వర్యంలో వేకువజామున శ్రీ రణమండల ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం అగ్గిగేరి సాయిబాబా ఆలయం నుంచి అభయాంజనేయస్వామి, కోట్లకూడలి మీదుగా పాత బస్టాండు వరకు రథోత్సవం కొనసాగింది. అక్కడి నుంచి తిరిగి సాయిబాబా ఆలయం వరకు రథోత్సవం చేరుకుంది. రథోత్సవం ముందు డోలు, సన్నాయి మధ్య చిన్నారులు, ఆంజనేయస్వామి మాలధారణ భక్తులు చిందులు వేసుకుంటూ ముందుకు సాగారు. ముందుగా ఆలయ నిర్వాహకులు టి.జి.పాండురంగయ్యశెట్టి, జిల్లాధ్యక్షుడు బసవన్నగౌడ్, సభ్యులు తిమ్మారెడ్డి ప్రదీప్, కునిగిరి నీలకంఠ, మారుతీరావు, దేవిశెట్టి ప్రకాష్, శ్రీనివాస ఆచారి, కమలేష్, లక్ష్మీనారాయణ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, చైర్‌పర్సన్ లోకేశ్వరి

ఆదోని టౌన్: ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ లోకేశ్వరి, మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలు ఇళ్లల్లోని చెత్తాచెదారాన్ని రోడ్లపై వేయకుండా డస్ట్‌బిన్‌లో వేయాలన్నారు. ఇళ్లలోని నీటిని రోడ్లపై వేయరాదన్నారు. అనంతరం మున్సిపల్ గ్రౌండ్‌లో మొక్కలు నాటారు.

ఆదోని సెంట్రల్: స్థానిక ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రుతుపవనాల వాటి ప్రభావం, ఆరోగ్య సమస్యలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారి అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, చెత్త సేకరణ, మరుగుదొడ్ల నిర్వహణపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

నందవరం : మండలంలోని గురజాల గ్రామంలో స్వర్ణాంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ పుల్లయ్యలు ప్లాస్టిక్ నిషేధంపై మండల అధికారులు, విద్యార్థులతో కలిసి ఎంపీపీ పాఠశాల నుంచి పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

కోసిగి: స్థానిక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులచే ఎంపీడీఓ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ విద్యార్థినులు మానవహారంగా ఏర్పడి స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేశారు.

మంత్రాలయం రూరల్ : పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్య రక్షణ సాధ్యపడుతుందని ఎంపీడీఓ మాధ్యూ హన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రైల్వే స్టేషన్ నుంచి రాఘవేంద్ర సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ ఈఓ ఉపేంద్రరెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా వుంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుండి గాంధీ సర్కిల్ వరకు విద్యార్థులు, మున్సిపల్, వార్డు సచివాలయం, వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ చేపట్టారు.

గోనెగండ్ల : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆదోని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వి. బాలకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని హెచ్. కైరవాడి గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనంతసేనా, సింగిల్‌విండో ప్రెసిడెంట్ తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

పెద్దకడుబూరు : స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ ప్రభావతి ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం మొక్కలు నాటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీంతో పాటు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ దగ్గర ఉన్న వాటర్ పంపింగ్‌లో క్లోరినేషన్ వంటి కార్యక్రమాలు చేపట్టారు.

స్నేహపూర్వకంగా మెలగాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ మధుసూదన్‌రావు

నందవరం: ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరూ స్నేహపూర్వకంగా మెలగాలని ఎమ్మిగనూరు రూరల్ సీఐ మధుసూదన్‌రావు సూచించారు. శనివారం మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి నేతృత్వంలో ఐదు గురు సీఐలు, ఐదుగురు ఎస్ఐలు, 50 మంది కానిస్టేబుళ్లతో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కార్డెన్ సెర్చ్‌లో భాగంగా రౌడీషీటర్లు, చెడు వ్యసనాలు కలిగిన వ్యక్తులు, అనుమానిత వ్యక్తుల ఇళ్లల్లో సోదాలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ప్రశాంతయైన గ్రామాల్లో అల్లరు సృష్టిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గొడవలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. గ్రామంలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వినాయక చవితి ఉత్సవాలలో సమాధాన సృష్టిస్తే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐలు మంజునాథ్, శ్రీనివాసులు, విజయభాస్కర్, రామాంజనేయులు, ఎస్ఐలు కేశవ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.